క్లుప్తంగా

బైపాసుకి రిటైనింగ్ వాల్



యడ్లపాడు: మండలం పరిధిలోని తిమ్మాపురం చేపల చెరువు సమీపంలో ప్రారంభం అయ్యే బైపాస్ రహదారి రిటైలింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తిమ్మాపురం నుంచి రూరల్ మండలం రామచంద్రాపురం డొంక వరకు 16.384 కి.మీ మేర సుమారు రూ.954 కోట్లతో నిర్మించిన ఈ బైపాస్ రహదారిని గతేడాది డిసెంబర్ 5వ తేదీన అమరావతి పీఐయూ ఎన్‌హెచ్ పీడీ పార్వతీశం ప్రారంభించి ట్రాఫిక్‌ను వదిలిన విషయం తెలిసిందే. బైపాస్‌కు సంబంధించి అన్ని మేజర్ పనులు పూర్తి చేసినప్పటికీ ఇంకా కొన్ని పనులు ఉన్నాయి. వీటిలో భాగంగా తిమ్మాపురం హైవే వంతెన సర్వీసు మార్గంలో ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. తారురోడ్డు ఎత్తు అధికంగా ఉన్నందున మట్టి జారకుండా ఉండేందుకు నాపరాళ్లతో రిటైనింగ్ వాల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా పనులు శరవేగంగా చేస్తున్నట్లు హైవే సిబ్బంది తెలిపారు.

సరికొండపాలెంలో రీసర్వే



బొల్లాపల్లి: మండలంలో రీసర్వేలో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా సరికొండపాలెం గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తహసీల్దార్ ఏవీ సుధాకర్ తెలిపారు. రీసర్వే జరుగుతున్న గ్రామాన్ని పరిశీలించారు. ఈ గ్రామంలో రీసర్వేకు 4 బృందాలను ఏర్పాటు చేయడమైందని తెలిపారు. ఇందులో తొలిగా గ్రామసరిహద్దులు నిర్ణయించడం, ప్రభుత్వ భూములను గుర్తించడం, రైతులకు సంబంధించిన భూములను గుర్తించడం జరుగుతుందన్నారు. రైతువారీ భూముల కొలతలు నమోదు చేసి ఎల్‌పీఎం నంబరు భూములకు కేటాయించడం జరుతుందని, ఆయా రైతులకు చెందిన భూములకు సరిహద్దు రాళ్ల ఏర్పాటు వేయనున్నట్లు తెలిపారు. రెవెన్యూ గ్రామ పరిధిలో రైతులకు చెందిన భూముల వివరాలను అందజేయాలని, ఆయా భూముల కొలతల నమోదు సమయంలో రైతులు ఆ భూముల గుర్తింపుకు సహకరించాలన్నారు.

ఘనంగా నాగమౌనీంద్ర స్వామి తిరునాళ్ల

బొల్లాపల్లి: మండలంలోని పేరూరుపాడు గ్రామంలో నాగమౌనీంద్ర స్వామి తిరునాళ్ల శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయానికి చేరుకొని నాగమౌనీంద్ర స్వామిని దర్శించుకొని పొంగళ్లతో నైవేద్యం సమర్పించారు. ఏపీ అసెంబ్లీ చీఫ్‌విప్, నియోజకవర్గ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ నిర్వహించారు. గ్రామంలో భక్తుల ఉల్లాసం కోసం రెండు భారీ విద్యుత్ ప్రభలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సుభాని


షేక్ సుభాని

చిలకలూరిపేట: అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శిగా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన షేక్ సుభాని ఎంపికయ్యారు. శ్రీకాకుళంలో ఈ నెల 6 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన యువజన సమాఖ్య రాష్ట్ర మహాసభల్లో ఆయనను ఈ పదవికి ఎంపిక చేశారు. విద్యార్థి దశ నుంచి విద్యార్థి, యువజన, నిరుద్యోగ సమస్యలపై నిరంతరం ఉద్యమాల్లో పాల్గొంటూ సుభాని ఈ ప్రాంతంలో సుపరిచితుడు. ఆయనకు ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పదవి వరించటం పట్ల పలువురు విద్యార్థి, యువజన, సీపీఐ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా చిత్రకళా పోటీలు



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వాసవీ హైస్కూల్లో జెస్టిస్ ఆర్ట్ అకాడమీ, పీపీ డబ్ల్యూస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో బాల బాలికలకు చిత్రకళా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ చిత్రకారులు వజ్రగిరి జెస్టిస్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ, ప్రైవే టు విద్యాసంస్థల అధినేతల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామని, ఈ నెల 19వ తేదీన పాఠశాలలో జరిగే చిత్రకళా పండుగలో ప్రభుత్వ చీఫ్‌విప్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పీజే లూకా, వాసవీ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్. అనిల్ కుమార్, కవి కమలారామ్, కేశవసూరి, జెస్టిస్ ఆర్ట్ అకాడమీ ప్రిన్సిపాల్ బ్యూలా, పఠాన్ ఖాసీం, పిరమిడ్ రాజు, షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

కోటయ్యా.. కొండకు చేరేదెలాగయ్యా!

ఈ మార్గంలో ప్రభలు నడిచేదెలా?

- టెండర్ లేకుండానే కొత్తపాలెం రహదారి పనులు
- రోడ్డును ధ్వంసం చేసిన టీడీపీ నాయకులు
- కంకర బయటపడి అధ్వానంగా మారిన రహదారి
- అక్రమ మైనింగ్‌తో గురవాయపాలెం దారిలో గోతులు


కొత్తపాలెం రోడ్డును ధ్వంసం చేయడంతో బయటపడిన కంకర

నరసరావుపేట రూరల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించే కోటప్పకొండ తిరునాళ్లకు సమయం దగ్గర పడుతున్నా అధికారుల్లో చలనం కనిపించం లేదు. కొండకు వెళ్లే ప్రధాన రహదారుల్లో సైతం ఇప్పటి వరకు మరమ్మత్తు పనులు చేపట్టలేదు. దీంతో తిరునాళ్లకు వచ్చే యాత్రికులు అధ్వాన్నంగా మారిన రహదారులతో తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈనెల 26వ తేదీన నిర్వహించే కోటప్పకొండ తిరునాళ్లకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది యాత్రికులు తరలివస్తారు.

యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తిరునాళ్ల ఏర్పాట్లను రెండు నెలల ముందు నుంచే ప్రారంభిస్తారు. ప్రధానంగా కొండకు వచ్చే రహదారుల్లో మరమ్మతు పనులు చేపట్టి తిరునాళ్లకు సిద్ధం చేస్తారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రహదారుల మరమ్మతు పనులు ప్రారంభించలేదు.

రోడ్డు ధ్వంసం

కోటప్పకొండ నుంచి కొత్తపాలెం వెళ్లే రహదారి తిరునాళ్లలో చాలా కీలకమైంది. నాదెండ్ల మండలం నుంచి వచ్చే వాహనాలు ఈ రోడ్డులో ప్రయాణిస్తాయి. దీంతో పాటు నరసరావుపేట-కోటప్పకొండ రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయిన సమయంలో చినతురకపాలెం మీదగా ఈ రోడ్డులోకి వాహనాలను మళ్లిస్తారు. తిరునాళ్లలో ప్రాధాన్యత ఉన్న రోడ్డు పట్ల పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహించారు. నూతనంగా 7 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3.5 కోట్లు మంజూరయ్యాయి. అయితే టెండరు పిలవకుండానే పనిని ప్రారంభించిన టీడీపీ నాయకులు రోడ్డును తవ్వారు. అయితే నూతన రోడ్డు నిర్మాణానికి సమయం లేకపోవడంతో అలాగే వదిలిపెట్టారు. రోడ్డును తవ్వడంతో కంకర బయటపడి ద్విచక్రవాహనాలు కూడా ప్రయాణించడానికి వీలు లేకుండా తయారైంది.


అధ్వానంగా మారిన గురవాయపాలెం ప్రభల దారి

ప్రభల దారి పై నిర్లక్ష్యం

పెట్లూరివారిపాలెం కాలువ నుంచి గురవాయపాలెం మీదగా కోటప్పకొండ రోడ్డుకు కలిపి రహదారి ప్రభల రాకపోకలకు వినియోగిస్తారు. ఈ దారి నుంచి కాకాని, ఉప్పలపాడు, గురవాయపాలెం భారీ విద్యుత్ ప్రభలు కొండకు చేరుకుంటాయి. గురవాయపాలెం సమీపంలో టీడీపీ నాయకులు అక్రమ మైనింగ్ కారణంగా ఈ దారి గోతులమయంగా మారింది. ఈ దారిలో ఇప్పటి వరకు మరమ్మతు పనులు ప్రారంభించ లేదు. పనులు సకాలంలో ప్రారంభించి పూర్తి చేయకపోతే ప్రభలు కొండకు చేరేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వస్తుందని ప్రభల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తిరునాళ్లకు పనులు పూర్తి చేస్తాం

కోటప్పకొండ తిరునాళ్ల రోజుకు పనులు పూర్తి చేస్తాం. కొత్తపాలెం రోడ్డును నూతనంగా వేసేందుకు పనులు ప్రారంభించారు. సమయం తక్కువగా ఉన్నందున వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇతర రోడ్ల మరమ్మతు పనులను ఇప్పటికే ప్రారంభించాం.

–సుబ్బరాయుడు, ఈఈ, పంచాయతీరాజ్

తిరునాళ్లలో భక్తులకు అసౌకర్యం కలుగనీయం

కోటప్పకొండలో పర్యటించిన మంత్రి గొట్టిపాటి, ఎంపీ, ఎమ్మెల్యేలు


మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి

నరసరావుపేట: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావుపేట, చిలకలూరిపేట ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవిందబాబులతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం కొండపై జరుగుతున్న పనులను పరిశీలించారు. చేయాల్సిన ఏర్పాట్లపై ఈఓ చంద్రశేఖర్‌తో చర్చించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ లక్షలాదిగా వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చేయాలనే సంకల్పంతో తిరునాళ్లను నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్ర పండగ అయినందున కావాల్సిన నిధులు విడుదల చేస్తామని, కొండపై పారిశుద్ధ్య నిర్వహణ, భక్తులకు త్వరగా దర్శనం చేసేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తామన్నారు. సంబంధిత శాఖకు చెందిన మంత్రితో మళ్లీ కొండకు వస్తామని పేర్కొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేస్తాం: ఈఓ

ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆలయ ఈఓ చంద్రశేఖర్ వెల్లడించారు. శనివారం కొండపై కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు ఏర్పాట్లు పరిశీలించి తగిన సూచనలు చేశారని వివరించారు.

సాతులూరులో ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు


సాతులూరులో సిడి మానోత్సవంలో గ్రామస్తులు

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొలువైయున్న గ్రామ దేవతల ఆలయాల తొమ్మిదో వార్షికోత్సవం శనివారంతో ముగిసింది. గత నెల 31న ప్రారంభమైన వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఐదు రోజుల పాటూ ఘటం కుండ ఊరేగింపు నిర్వహించారు. 5వ తేదీన వసంతోత్సవం నిర్వహించారు. 6వ తేదీన పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. అదేరోజు అన్నదానం చేశారు. 7వ తేదీ మొక్కుబడులు తీర్చుకున్నారు. 8వ తేదీన గ్రామ పురవీధుల్లో సిడిమానోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సాంప్రదాయబద్ధమైన మేళతాళాలతో స్వామి వారిని ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలంకరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఘనంగా భీష్మ ఏకాదశి పూజలు


నూజెండ్లలో పూజల్లో పాల్గొన్న భక్తులు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా లక్ష తులసి దళాలతో స్వామికి అర్చన 108 మంది మహిళలతో విష్ణు సహస్రనామ అర్చన, స్వామి వారికి పూజలు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసుల శ్రావణ్ కుమార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని లక్ష తులసి దళాలతో ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు రెడ్డి బంగారయ్య సెక్రటరీ అచ్యుత కృష్ణ సుబ్బారావు కోశాధికారి కాళ్ళ రామకోటేశ్వరరావు గుడిపాటి కోటేశ్వరరావు వాసు అన్న సుబ్బారావు కాకుమాను రామకోటేశ్వరరావు సనిశెట్టి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నూజెండ్ల: భీష్మఏకాదశి పర్వదినం సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవాలయం, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్‌చాలీసా పారాయణం, తోమాల సేవలతోపాటు పలుకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు కోసూరి రామ్మోహనాచార్యులు ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.

12న కొండ గురునాధ స్వామి తిరునాళ్లు



నూజెండ్ల: మండలంలోని రవ్వవరంలో గ్రామంలో వేంచేసియున్న శ్రీకొండ గురనాధ స్వామి వారి తిరునాళ్ల వేడుకలు ఈనెల 12న గ్రామస్తులు సారథ్యంలో ఘనంగా జరుగుతాయి. ప్రసిద్ధి చెందిన తిరునాళ్ల వేడుకలకు ప్రకాశం, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకుంటారు. తిరునాళ్ల వేడుకలు పురస్కరించుకుని ఈనెల 11న మెట్ల పూజ, గ్రామంలో దేవత విగ్రహాలు ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త లక్కిరెడ్డి రమణారెడ్డి తెలిపారు. మహిమాన్వితుడైనా స్వామిగా కొలిచే కొండ గురనాధ స్వామిగా అందరు దర్శించుకుంటారు. తిరునాళ్ల పర్వదినం రోజున విద్యుత్ ప్రభలు సాంస్కృతిక కార్యక్రమాలు వివిధ సామాజిక వర్గాలకు చెందిన అన్నదాన సత్రాల్లో భారీ అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయి. తిరునాళ్ళ వేడుకల్లో అందరు పాల్గొని స్వామివారిని దర్శించుకొని పాత్రులు కావాలన్నారు.

మట్కాతో.. జీవితాలు బుగ్గి

- సత్తెనపల్లి యథేచ్ఛగా నమోదు
- నరసరావుపేట నుంచి సత్తెనపల్లికి పాకిన వైనం
- చోద్యం చూస్తున్న పోలీసులు


సత్తెనపల్లిలో బహిరంగంగానే సింగిల్ నంబర్ రాసి ఇస్తున్న ఏజెంట్

సత్తెనపల్లి: మట్కా మహమ్మారి ఉచ్చులో చిక్కుకొని సామాన్య, మధ్య తరగతి వర్గాల ప్రజలు జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. ఒక్క సారి దాంట్లో ఇరుక్కుంటే అన్నులను కోల్పోయి కుటుంబాలు చిన్నాభిన్నం కావాల్సిందే. ఒకప్పుడు కేవలం జిల్లా కేంద్రం నరసరావుపేటకే పరిమితమైన మట్కా ప్రస్తుతం జిల్లా ముఖద్వారమైన సత్తెనపల్లికి పాకింది.

నిఘా ఏది..?

డివిజన్‌లోని సత్తెనపల్లి పట్టణంలో మట్కా యథేచ్ఛగా సాగుతోంది. మట్కా నిర్వాహకులు ఆడే వారిని సెల్‌ఫోన్ ద్వారా సంప్రదించి కాగితాలపై రాస్తూ ఆడిస్తున్నారు. ఒక్కసారి మట్కా తగిలితే ఆశతో చిరు వ్యాపారులు, తోపుడుబండ్ల విక్రయాలు సాగించే వ్యాపారులు, పేదల కాలనీలో కొంతమంది ఆట బారిన పడుతున్నారు. కొంతమంది రాజకీయ నాయకులు మట్కా రాయుళ్లతో సంబంధాలు నెరుపుతూ డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులు సరైన నిఘా పెట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి.

పట్టణంలో ఇలా..

పట్టణంలో 15 నుంచి 20 మంది వరకు ఏజెంట్లు మట్కా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏజెంట్ కొంతమందిని పెట్టుకుని రోజుకు రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. మహమ్మారిపై ఉక్కు పాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

సత్తెనపల్లిలో ఎక్కడెక్కడ...

రెవెన్యూ డివిజన్ కేంద్రమైన సత్తెనపల్లిని ప్రధాన కూడళ్లు, మారుమూల కాలనీలో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం. సత్తెనపల్లిలో బహిరంగంగానే రోడ్లపై కూర్చొని విక్రయాలు చేస్తున్నారు. ప్రధానంగా గార్లపాడు సెంటర్, పాత బస్టాండ్, మార్కెట్ ఏరియా, ఎన్టీఆర్ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ రోడ్, ఐదులాంతర్ల సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లలో రోజు మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం.

పూర్తిస్థాయిలో దృష్టి పెడతాం

మట్కా నిర్వహణపై పరిశీలించి, పూర్తి స్థాయిలో దృష్టి పెడతాం. ఇప్పటికే లాటరీ టికెట్ల నిర్వాహకులపై కేసులు కూడా నమోదు చేశాం. నిషేధిత జూదాలు జరుగుతుంటే ప్రజలు సమాచారం అందించి సహకరించాలి.

–బి.బ్రహ్మయ్య, సీఐ, సత్తెనపల్లి టౌన్

గండిగనుమలలో దాహం దాహం

- గ్రామస్తులను వేధిస్తున్న నీటి సమస్య
- వేసవికి ముందే మొదలైన వైనం


గండిగనుమల మినీ ట్యాంక్ వద్ద నీటి కోసం దర్శనమిస్తున్న ఖాళీ బిందెలు, మహిళలు

బొల్లాపల్లి : వేసవికి ముందే నీటి కష్టాలు... ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని నీటి సమస్య... అడుగంటిన భూగర్భజలాలు.. మొరాయిస్తున్న బోర్లు.. మరమ్మతులకు నోచుకోని మోటారులు... వెరసి పట్టించుకోని అధికారులు.. ఇది మండలంలోని గండిగనుమల గ్రామంలో పరిస్థితి. తాగునీటి సమస్య వేధిస్తోందని, గత 20 రోజుల నుంచి నీటి కష్టాలు మొదలయ్యాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ ఏడాది వేసవికి ముందు నుంచే నీటి ఎద్దడి నెలకొంది. దాహార్తి కోసం పరుగులు పెడుతున్నామని గ్రామస్తులు అంటున్నారు. గ్రామంలో 3 వేలకు పైగా జనాబా చిన్నాపెద్దలు ఉన్నారు. పశువులతో పాటు గ్రామస్తులు సైతం దాహార్తి తీరక అలమటిస్తున్నారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో ఉన్న మినీ ట్యాంక్ ఒకటి మాత్రమే పనిచేస్తుందని, ట్యాంక్ వద్ద బిందెలు బారులు తీరి నీళ్ల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో మొత్తం 10 నుంచి 15 సింగిల్ ఫేస్ మోటార్లు ఉండగా అక్కడక్కడా ఒకటి రెండు మాత్రమే పని చేస్తున్నాయి. తాగునీటి కోసం పొలం బాట పట్టాల్సిన దుస్థితి ఏర్పడింది.

పొలం పనులతో తీరిక లేని సమయంలో నీళ్ల కోసం ఇంట్లో ఒకరిద్దరు పనులు మానుకోవాల్సి వస్తుందని గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌తో పాటు బోరు ఉన్నప్పటికీ పనిచేయవని, పట్టించుకున్న దాఖలాలు లేవంటున్నారు. నీటి కొరత వల్ల పశువులు సైతం విలవిల్లాడుతున్నాయని, ఈ ఏడాది వరుస తుఫాన్ల ప్రభావం వల్ల విరివిగా వర్షాలు కురిసినప్పటికీ జనవరి నెలలోనే నీటి సమస్య జఠిలమైంది. గ్రామంలో నీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారానికి నోచుకోవడం లేదు. తాత్కాలిక చర్యలు తప్పించి ఏళ్ల తరబడి ఉన్న సమస్యను పరిష్కరించడంలో పాలనా అధికార యంత్రాంగం విఫలమవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నీటి సమస్యపై పాలకులు, అధికారులు దృష్టిసారించి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పొలం బాట పట్టిన గ్రామస్తులు భాస్కర్‌నాయక్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



భూగర్భ జలాలు అడుగంటాయి. గ్రామంలో నీటి సమస్యను గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా.

– ఎం.ఆకాష్‌నాయక్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ

10 నుంచి టెన్త్ విద్యార్థులకు పోషకాహార పంపిణీ

శావల్యాపురం: ఈనెల 10వ తేదీ నుంచి పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం సమయంలో పోషకాహారం అందించాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు శనివారం తెలిపారు. ఈసందర్భంగా స్థానిక వనరుల కేంద్రంలో ఎంఈవో మాట్లాడుతూ జడ్పీ నిధులు ద్వారా ఒక్కో విద్యార్థికి రూ.7.50 పైసలు విలువ చేసే పోషకాహారాన్ని ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయుల సారథ్యంలో ఉపాధ్యాయులు అందించాలన్నారు. మండలంలోని ఐదు జడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని 255 మంది విద్యార్థులు పదోవ తరగతి పరీక్షలు వచ్చే 17 నుంచి రాయనున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వారి బ్యాంకు ఖాతాకు నగదు జమ చేస్తుందన్నారు. విద్యార్థులకు ప్రతిరోజు సాయంత్రం సమయంలో పోషకాహారం గుగ్గిళ్ళు, పండ్లు, శనగముద్దలు, బిస్కట్లు, తదితర పోషకాలు రోజువారీగా పంపిణీ చేయాలన్నారు.

ముమ్మరంగా సత్రశాలలో శివరాత్రి ఏర్పాట్లు

వలంటరీ సేవలకు దేవస్థానం ఆహ్వానం


శివరాత్రికి ముస్తాబు చేస్తున్న సత్రశాల దేవస్థానం

సత్రశాల(రెంటచింతల): ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న సత్రశాల శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 26న జరగనున్న మహాశివరాత్రి వేడుకలకు సంబంధించిన పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అతిపురాతనమైన శైవక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఈ దేవస్థానానికి రాష్ట్రంలోనే ఒక ప్రత్యేక స్థానం ఉంది. శివరాత్రి సందర్భంగా తరలి వచ్చే వేలాది మంది భక్తులకు ఏలాంటి ఇబ్బందులు పడకుండా స్వామివారి దర్శనం చేసుకునే విధంగా బారికేట్లు, మంచినీటి సదుపాయం, పార్కింగ్, మహిళలు స్నానాలు చేసేందుకు కృష్ణానది వద్ద వసతి, విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. దేవస్థానం కమిటీ సభ్యులు, పరాశక్తి సిమెంట్ ప్యాక్టరీ యాజమాన్యం, ఏపీ జెన్‌కో నాగార్జున సాగర్ టైయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు, వివిధ శాఖాధికారుల సహాయ సహకారాలతో భక్తులకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నూరు శాతం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఎంతో పవిత్రమైన మహాశివరాత్రి పర్వదినాన రెండు తెలుగు రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలకు చెందిన వేలాదిమంది భక్తులు రాష్ట్రంలోనే అతిపురాతనమైన మల్లికార్జునస్వామి దర్శనం చేసుకునేందుకు ఇక్కడకు వస్తారు. భక్తులకు సేవ చేయడానికి మంచి మనస్సుతో యువతియువకులు వాలంటీర్లుగా విధులు నిర్వహించడానికి ముందుకు రావాలని నిర్వాహకులు కోరారు. ఆసక్తి కలిగిన 99496 46208 నంబరుకు సంప్రదించాలని కోరారు.

ఢిల్లీ విజయంపై బీజేపీ వేడుకలు

నరసరావుపేట: ఢిల్లీ ఎన్నికల్లో భారతీయజనతా పార్టీ (బీజేపీ) గెలుపును పురస్కరించుకొని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం సాయంత్రం పట్టణంలోని శివునిబొమ్మసెంటర్‌లో వేడుకలను నిర్వహించారు. బాణాసంచా కాల్చి ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

నరసరావుపేట: గుంటూరు, కృష్ణా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రోగ్రెసీవ్ డెమోక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) అభ్యర్థిగా ఐదవసారి పోటీచేస్తు న్న కేఎస్ లక్ష్మణరావు నామినేషన్ ప్రక్రియలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంస్థ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉదయం పదిగంటలకు సభ జరుగుతుందని, అనంతరం సభా ప్రాంగణం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శనతో వెళ్లి నామినేషన్ వేస్తారన్నారు.